జర్నీ.. ఈజీగా..

ప్రధానరోడ్లు, ఓఆర్ఆర్‌కు లింకురోడ్లతో అనుసంధానం


- ట్రాఫిక్ సమస్యకు చెక్..
- అత్యధిక లింకురోడ్లు గచ్చిబౌలిలోనే..



ఖాజాగూడ మోడల్ రోడ్డు నుంచి 'ఎస్కీ' మీదుగా గచ్చిబౌలిలోని పాత ముంబాయి జాతీయ రహదారిని కలిపే లింకురోడ్డు ఇదే



రాయదుర్గంలోని పాతముంబాయి జాతీయ రహదారిని జూబ్లీహిల్స్ ప్రాంతాన్ని కలుపుతూ వేసిన రోడ్డు



హైదరాబాద్ నాలెడ్జి సిటీని కలుపుతూ భారీ గుట్టను తొలచి నిర్మించిన లింకురోడ్డు

రాయదుర్గం: లింకురోడ్లతో ముఖ్యంగా రాయదుర్గం, నానక్‌రాంగూడ, రాయదుర్గం సర్వే నంబర్ 83 ప్రాంతాలలోని ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జిసిటీ ప్రాంతాలకు రాకపోకలు సులువుగా మారాయి. ఇప్పటికే పలుచోట్ల లింకురోడ్ల నిర్మాణంతో దూరభారం తగ్గడం, పెట్రోల్, డీజిల్ ఆదా కావడం, ట్రాఫిక్ సమస్యలు తీరాయి. నగరంలో ఎక్కడా లేని విధంగా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జిసిటీ ప్రాంతాలలో ప్రధాన రోడ్లను కలుపుతూ లింకురోడ్ల నిర్మాణం చేశారు. నగరంలో అత్యధిక లింకురోడ్లు నిర్మాణం చేసిన ప్రాంతంగా గచ్చిబౌలి డివిజన్‌గా చెప్పక తప్పదు. ముఖ్యంగా కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, నార్సింగి, మణికొండ వంటి ప్రాంతాల నుంచి వచ్చే ఐటీ ఉద్యోగులు, 'మనూ', సెంట్రల్ యూనివర్సిటీ, ఐఎస్‌బీ, నిథమ్, ట్రిపుల్‌ఐటీ, గచ్చిబౌలి స్టేడియం వంటి ప్రాంతాలకు వచ్చే వారికి లింకురోడ్ల నిర్మాణంతో ప్రయాణం సుగమం అయింది.

అందుబాటులోకి వచ్చిన లింకురోడ్లు ఇవే..

- రూ.15.07 కోట్లతో మల్కంచెరువు వద్ద ఓల్డ్ ముంబాయి పాత హైవే నుంచి ఖాజాగూడ లింకు రోడ్డు వయా మల్కంచెరువు, చిత్రపురి కాలనీ రోడ్డు వరకు 950 మీటర్ల లింకురోడ్డు
- రూ.47.66 కోట్లతో ఖాజాగూడ చెరువు నుంచి ఔటర్ రింగురోడ్డు వరకు ఉర్దూ యూనివర్సిటీ ప్రహరీగోడ సమాంతరంగా 2.20 కిలోమీటర్ల లింకురోడ్డు నిర్మాణం
- రూ.19.51 కోట్ల వ్యయంతో 2.30 కిలోమీటర్ల ఖాజాగూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ మీదుగా పాత ముంబాయి జాతీయ రహదారిని కలిపే లింకురోడ్డు
- రూ.15.54 కోట్లతో 1.20 కిలోమీటర్ల జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 నుంచి రాయదుర్గంలోని లిడ్‌క్యాప్ ప్రాంగణం మీదుగా పాత ముంబాయి జాతీయ రహదారిని కలుపుతూ నిర్మించిన రోడ్డు .
- రూ.10 కోట్ల వ్యయంతో నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఐసీఐసీఐ బ్యాంక్ ముందున్న రోడ్డుతో ఔటర్‌రింగు రోడ్డు సర్వీస్ రోడ్డుకు లింకురోడ్డు నిర్మాణం పూర్తి
- రూ.20 కోట్ల వ్యయంతో హైదరాబాద్ నాలెడ్జి సిటీ నుంచి పాతముంబాయి జాతీయ రహదారికి భారీ గుట్టను తొలచి రోడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు.

ఇంకా పూర్తి చేయాల్సినవి ..

- ఖాజాగూడ పెద్ద చెరువు నుంచి గుట్టను తొలచి ఉర్దూ యూనివర్శిటీ ప్రహరీగోడ మీదుగా ఓఆర్ఆర్ వరకు నిర్మించతలపెట్టిన లింకురోడ్డు పూర్తికావాల్సి ఉంది.
- గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో నుంచి నల్లగండ్ల చెరువు పక్క నుంచి నల్లగండ్ల అపర్ణా అపార్ట్‌మెంట్స్ వరకు లింకురోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉంది.
- ఐఎస్‌బీ పక్క నుంచి టీఎన్‌జీఓ కాలనీ వరకు వేసిన లింకురోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. ముఖ్యంగా ఈ రోడ్డులో డివైడర్, గ్రీనరీ ఏర్పాటు చేయాలి. హెచ్‌సీయూ స్థలంలో వేయడంతో వచ్చాన సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

లింకురోడ్లతో పలు ప్రాంతాలకు లింకు..

- లింకురోడ్ల ఏర్పాటుతో అనేక ప్రాంతాలతో లింకు ఏర్పడి ట్రాఫిక్ సమస్య తీరింది. అందులో ముఖ్యంగా రాయదుర్గం ప్రధాన రోడ్డు నుంచి టింబర్ లేక్ కాలనీ, చిత్రపురి కాలనీ, ఖాజాగూడ, ఓఆర్ఆర్‌కు సులువుగా మార్గం ఏర్పడింది.
- ఖాజాగూడ నుంచి ఇంజనీరింగ్ కళాశాల మీదుగా గచ్చిబౌలి ప్రధాన రోడ్డుకు లింకు ఏర్పడినట్లయింది.
- ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి లింకురోడ్డు వేయడంతో కొత్తగా రోడ్డు ఏర్పడడంతో చుట్టూరా తిరిగే సమస్యలేకుండా పోయింది.
- రాయదుర్గంలోని పాత ముంబాయి జాతీయ రహదారి నుంచి జూబ్లీహిల్స్‌లోని పలు కాలనీలకు కొత్తగా లింకురోడ్డు ఏర్పడినట్లయింది.
- పాతముంబాయి జాతీయ రహదారి నుంచి చిత్రపురి కాలనీని కలుపుతూ ఖాజాగూడ మీదుగా ఔటర్ రింగురోడ్డు సర్వీస్‌రోడ్డును కలిపేలా చేసే రోడ్డు నిర్మాణం
- నానక్‌రాంగూడలో ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డును ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి వేసిన రోడ్డుతో ప్రయాణం సులువు అయింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- భిక్షపతి ఎన్‌క్లేవ్ పరిధిలో.. ఉదయం 8.00 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్లు 3,4,6, రాఘవేంద్ర హోటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు.11 కేవీ రాయదుర్గం ఫీడర్ పరిధిలో.. రాయదుర్గం పోలీస్‌స్టేషన్, మధురానగర్, ఖాజాగూడ, నిహారికా అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.
- 11 కేవీ శ్రీరామ స్కూల్ ఫీడర్ పరిధిలో ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు శ్రీరామ స్కూల్, నానక్‌రాంగూడ, ఎమరాల్డ్ గార్డెన్స్ ప్రాంతాలలో
- పద్మశ్రీ గార్డెన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు పద్మశ్రీ గార్డెన్స్, గౌలిదొడ్డి ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో గురువారం ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 7.00 గంటల వరకు చందానగర్ మెయిన్ రోడ్డు, వెంకటేశ్వరస్వామి టెంపుల్, చెన్నారెడ్డి హాస్పటల్ దగ్గర, గీత థియేటర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

నల్లగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ జవహర్ నవోదయ విద్యుత్ ఫీడర్ ప్రాంతంలో.. గురువారం ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు నల్లగండ్ల, హుడా కాలనీ, కంచ గచ్చిబౌలి, సాయిరామ్ నగర్, అపర్ణా ఎదురు ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.

మనూలో ఎంఏ విమెన్స్ స్టడీస్‌లో ప్రవేశాలు

దరఖాస్తునకు జూన్ 30 ఆఖరు

రాయదుర్గం: మనూలోని విమెన్స్ స్టడీస్ సబ్జెక్టు విద్యార్థులకు కెరీర్ అవకాశాలు మెండుగా ఉంటాయని 'మనూ' డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్(డీడబ్ల్యూఈ) హెడ్ ప్రొఫెసర్ అమీనా తహసీన్ బుధవారం తెలిపారు. ఎంఏ విమెన్స్ స్టడీస్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 30 అని ఆమె పేర్కొన్నారు. ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన మదర్సా కోర్సులు ఉన్న విద్యార్థులు మెరిట్ ప్రాతిపదికన ఎంఏ విమెన్ స్టడీస్‌లో ప్రవేశం పొందేందుకు అర్హులని ఆమె వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ప్రాస్పెక్టస్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు గది నెంబర్ 101 మహిళా విద్యాశాఖ, లెక్చర్ హాల్ కాంప్లెక్స్ మనూ క్యాంపస్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 9392303545, 9985740884లో సంప్రదించాలని సూచించారు.

వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకం



నర్సును సన్మానిస్తున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డి జిల్లా ఆస్పత్రి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

శేరిలింగంపల్లి: వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం శేరిలింగంపల్లిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్లారెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆమె చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సులు సేవామూర్తులన్నారు .రోగులకు వైద్యులు ఇచ్చే మందులు ఎంత ముఖ్యమో, నర్సుల సేవలు కూడా అంతే ముఖ్యం అన్నారు. నర్సింగ్ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన బీహెచ్‌ఈఎల్, నిమ్స్, గచ్చిబౌలి టిమ్స్, కొండాపూర్‌లోని జిల్లా హాస్పిటల్, శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, ఈఎస్ఐ రామచంద్రాపురం, ఉర్దూ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ హెల్త్ సెంటర్స్, పటాన్‌చెరు ఏరియా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో పని చేసిన 80 మంది నర్సులను సన్మానించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజయలక్ష్మి, వాణీ సాంబశివరావు, జనార్దన్, పాలం శ్రీను, ధర్మసాగర్, వెంకటేశ్వర్లు, బాలన్న, సంతోషి,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పరిశోధన పత్రం సమర్పణ



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థిని శిల్పా రాజీవన్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్ క్లూజివ్ పాలసీలో డాక్టర్ రాణి రత్నప్రభ పర్యవేక్షణలో శిల్పారాజీవన్ పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆమె 'మహిళలు పర్యావరణ సంరక్షకులు' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్ఎస్ఈ) ఇంటర్నేషనల్ అసమానత కేంద్రం నిర్వహించిన 'వాతావరణ మార్పు, అసమానత'పై వర్క్‌షాప్‌లో కేరళలోని హరిత కర్మసేన(హెచ్‌కేఎస్) ద్వారా జెండర్ పాత్రల పరివర్తన' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు



ఎమ్మెల్యే గాంధీని కలిసిన మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురు డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాదాపూర్ డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ ఓట్లు సాధించేందుకు కృషి చేశారని, వారందరూ అభినందనీయులన్నారు. బీఆర్ఎస్ చేవెళ్ళ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించడం ఖాయమన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని బుధవారం బీఆర్‌యస్ నాయకులు , కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని ఓటర్లను చైతన్యపరచడంలో పార్టీ శ్రేణుల కృషి ఎనలేదని ఎమ్మెలే అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు చిన్న మధుసూదన్‌రెడ్డి, మామిడాల రాజయ్య, ఖాసి, లియకత్, బాబు మియా, సలీం, రాజయ్య, మియన్ పటేల్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈలో 'మనూ మోడల్ స్కూల్' వందశాతం ఉత్తీర్ణత

రాయదుర్గం: సీబీఎస్ఈ ప్రకటించిన ఫలితాల్లో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని మోడల్ స్కూల్‌లోని పదవ తరగతి, 12వ తరగతి విద్యార్థులు సత్తా చాటారు. పదోతరగతిలో 47 మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కఫీల్ అహ్మద్ బుధవారం తెలిపారు. 47 మందిలో 13 మంది విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించారు. అదేవిధంగా 12వ తరగతిలో మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 30 మంది ఉత్తీర్ణులయ్యారని ఒకరికి కంపార్ట్‌మెంట్ లభించింది.కాగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ మంచి ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి యేటా 100 శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

మియాపూర్: ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం...కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా దేవినగర్‌కు చెందిన బి.మల్లేషప్ప(21) మియాపూర్‌లోని ఓంకానగర్‌లో ఉంటున్న బావ గిరిబాబు, అక్క దగ్గర ఉంటున్నాడు. స్థానికంగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నాడు. మంగళవారం ఉదయం ఎవరూలేని సమయం చూసి ఇంటి పైకప్పు రాడ్‌కు లుంగీతో మల్లేషప్ప ఉరివేసుకున్నాడు. ఇంటి పక్కన ఉన్నవారు ఉదయం 9 గంటల ప్రాంతంలో చూసి కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతుడి అన్న రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మాదాపూర్: మాదాపూర్ శిల్పారామం వద్ద పుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహం లభించింది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అతని ఎత్తు 5.4 , రింగుల జుట్టు, బ్రౌన్‌కలర్ జాకెట్, బ్రౌన్ బనియన్ , బ్లు కలర్ జీన్స్ వేసుకుని ఉన్నట్టు తెలిపారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతని వివరాలు తెలిస్తే ఈ ఫోన్ నంబర్లలో 9890617182, 8711256698 సంప్రదించాలని సూచించారు.

లీకేజీ.. తాగునీరు కలుషితం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న వాల్వ్ లీకేజీ అవడంతో అక్కడ ఏర్పడ్డ గుంతలో నీరు నిలిచిపోతోంది. నీటి సరఫరా నిలిచిన తర్వాత మురుగునీరు తిరిగి పైపుల్లోకి వెళ్లి కలుషిత నీరు సరఫరా అవుతుందని మణికొండ గార్డెన్, సెక్రటేరియట్ కాలనీ, కేపీఆర్ కాలనీ, మణికొండ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి వెంటనే లీకేజీ సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోండి

పటాన్‌చెరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను డిగ్రీ తొలి సంవత్సరంలో చేరే విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మీసేవ కేంద్రంలో కానీ, కళాశాలలో గాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. బీ.ఏ, బీకాం, కంప్యూటర్, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సి గ్రూప్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో 780 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో అన్ని సౌకర్యాలతో పాటు నిపుణులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. ప్రతిభగల విద్యార్థులకు మలబార్ గోల్డ్ స్కాలర్ షిప్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.

సమతుల్య వ్యవసాయంపై శిక్షణ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'సమతుల్య వ్యవసాయంలో సాంకేతికత' అనే అంశంపై ఉద్యాన రైతులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వారం పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహ సంచాలకుడు డాక్టర్ ఎం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. నీటి సాంకేతిక పరిజ్ఞాన సంచాలకులు వారం పాటు ఉద్యాన పంటలైన కూరగాయలు, పూల తోటల పెంపకంలో ఆధునిక పరిజ్ఞాన వినియోగం, అలాగే పంటల ఎగుమతి అవకాశాలను కూడా రైతులకు వివరించనున్నారు. నేషనల్ కమిటీ ఆన్ ప్రెసిసన్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ఈ కార్యక్రమానికి సహకారం అందించింది. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు ప్రేమ్‌సింగ్, అనిల్‌కుమార్, వివిధ జిల్లాల నుంచి యువ రైతులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న రైతులు, అధికారులు

రోడ్ల పక్కన చెత్త.. ఇబ్బందులు



భారతీనగర్ డివిజన్‌లోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ రోడ్డులో చెత్త

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్ పరిధిలో పలుచోట్ల రోడ్లపై ఇష్టానుసారంగా చెత్తను పడేస్తున్నారు. దాంతో రోడ్లు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. రోడ్డుపై ఉన్న చెత్త వద్దకు పశువులు, పందులు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గం చెత్తమయంగా మారింది. కనీసం ఆ మార్గంలో చెత్తను కూడా తొలగించడంలేదు. ఈ మార్గంలో వెళ్లే వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఎంకేవై యువసేన ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మదర్ మేరీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రోడ్డుపై మురుగు

మియాపూర్: రోడ్డుపై మురుగు పారుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్ 14లో మ్యాన్‌హోళ్లు పొంగి రోడ్డుపై మురుగు ప్రవహిస్తుంది. దీంతో స్థానికులు దుర్వాసన భరించలేక ఇబ్బందులుపడుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



దీప్తిశ్రీనగర్ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఓవర్ టూ గోవా..!

- నార్సింగి మున్సిపాలిటీలో వేడెక్కిన రాజకీయం
- గోవా బాట పట్టిన కౌన్సిలర్లు
- ఈ నెల 18న అవిశ్వాస సమావేశం
- నేరుగా మీటింగ్‌కు వచ్చేలా ప్రణాళిక



నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయం

మణికొండ: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే నార్సింగి మున్సిపాలిటీ రాజకీయం మరింత వేడెక్కింది. మున్సిపాలిటీకి చెందిన 12 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు లేఖను అందించారు. దాంతో కలెక్టర్ ఈనెల 18వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అయితే సమయం దగ్గర పడడం, ఎక్కడ తమపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అతని వర్గీయుల నుంచి ఒత్తిడి వస్తుందనే కారణంతో 9 మంది కౌన్సిలర్లు గోవాకు పయనమయ్యారు. ఈనెల 18వ తేదీన ఉదయం 11గంటలకు నేరుగా నార్సింగికి వచ్చేలా ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

గండిపేట అవిశ్వాసాలు.. కేరాఫ్ గోవా

గండిపేట మండల పరిధిలోని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం పెట్టి ఏకంగా నెల రోజుల పాటు గోవాలోనే ఉన్నారు. అలాగే మణికొండ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లలో కొందరితో పాటు చైర్మన్‌కు అండగా నిలిచిన కౌన్సిలర్లు సైతం గోవా కేంద్రంగానే క్యాంప్ రాజకీయాలు నిర్వహించారు. బండ్లగూడలో మేయర్ పీఠం దిగిపోగా మణికొండలో చైర్మన్ పదవి అలాగే ఉంది. రెండు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తంతు ముగియగానే ఇపుడు నార్సింగి కేంద్రంగా మొదలయ్యింది. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లలో ఇప్పటికే 9 మంది గోవా బాట పట్టగా, మరో ముగ్గురు గురువారం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. దాంతో గండిపేట మండల పరిధిలోని మూడు మున్సిపాలిటీల అవిశ్వాస రాజకీయాలు గోవా కేంద్రంగా జరుగుతుండడంపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్, వెల్‌విషర్ కాలనీకి చెందిన గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ తనయుడు దొడ్ల రామకృష్ణ గౌడ్ బుధవారం మృతి చెందిన గంగాధర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యాదగిరి పాల్గొన్నారు.

నల్లగండ్లలో హల్దీరామ్ రెస్టారెంట్ ప్రారంభం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలో హల్దీరామ్ క్విక్ సర్వీస్ రెస్టారెంట్‌ను డైరెక్టర్ నీరజ్ అగర్వాల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ప్రియులకు రుచికరమైన స్వీట్లు, భారతీయ వంటకాలను అందిస్తామన్నారు. ఈ రెస్టారెంట్‌లో సేవ్ భుజియా, మురుకులు, ఫరాలీ చివ్డాతో పాటు నవాబీ డీలక్స్, థాలీ, సంపూర్ణ డీలక్స్ థాలీ, పావ్ భాజీ, జైన్ డిలైట్స్, పనీర్ టిక్కా, నాన్ పిజ్జా ఉంటాయన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్‌నగర్ రోడ్డు నెంబర్ 2 నుంచి 5 వరకు చేపట్టనున్న యూజీడీ పైపులైన్ నిర్మాణ పనులను బుధవారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంనరేష్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. హైదర్‌నగర్ డివిజన్‌లో వందశాతం సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు పూర్తి చేస్తామన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కాలనీవాసులు నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, రాజిరెడ్డి, చాట్ల రవి, చంద్రయ్య, రాఘవేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, నరేందర్ రెడ్డి, దేవేందర్, ఎల్లస్వామి, పీరయ్య, నాగార్జునరెడ్డి, బ్రహ్మయ్య, చంద్రారెడ్డి, విమల, స్వప్న పాల్గొన్నారు.